# కథ చెప్పరూ !

"నాన్నగారూ నా చందమామ పుస్తకం చూశారా?"

చదువుతున్న ఫైల్లోంచి తల యెత్తి పప్పీ మొహంలోకి చూశాను.

దానికిపుడు తొమ్మిదేళ్ళు. నాలుగో తరగతి చదువుతోంది.

"లేదు తల్లీ. సాయంత్రమే కదమ్మా కొని తెచ్చాను. అపుడే ఏమైంది" అన్నాను.

"ఇందాకటి వరకూ నా రూంలోనే ఉండింది. హోంవర్క్ అయాక చదువుదామని పక్కన పెట్టుకున్నాను. తీరా ఇప్పుడు చూస్తే కన్పించటం లేదు". అందమైన పప్పీ కళ్ళలో కదలాడుతూ దిగులు.

నాకు పప్పీ అంటే చాలా ఇష్టం. బహుశా అదొక్కటే సంతానం కావటం వల్లనుకుంటాను. దాన్ని చాలా గారాబంగా చూసుకుంటాం. దానికి తోడు బంగారు బొమ్మలా ఉంటుంది. బంగారానికి మెరుగులా తెలివైన పిల్ల కూడా. ఒక్కసారి చెప్తే చాలు ఇట్టే అల్లుకుపోతుంది అందుకే అది దిగులుపడితే నా గుండె కొట్టుకుపోతుంది.

"పోన్లేమ్మా. ఇపుడు టైం పది కావస్తోంది పోయి పడుకో" అన్నాను లాలింపుగా.

పప్పీ వచ్చి నా పక్కన కూచుంది.

ఓ క్షణం నా వైపు చూసి నవ్వింది. తను చేయబోయే పనికి నాకు కోపం రాకుండా ముందుగా ఇచ్చే మత్తు మందు ఆ నవ్వు.

నా చేతిలో ఉన్న ఫైల్‌ని సుతారంగా మూసేసింది.

"అదేంటమ్మా ! నాకు బోల్డు పని ఉంది" అన్నాను.

"ఎప్పుడూ ఆఫీస్ పనేంటి నాన్నగారూ. మీ బాస్ కసలు బుద్ధి లేదు. మా హోంవర్క్ కన్నా మీ హోంవర్కే ఎక్కువగా ఉంటోంది" అంది పప్పీ చిరుకోపంగా.

బట్టతలతో, సోడాబుడ్డి కళ్ళద్దాలతో అలరారే మా బాస్ గుర్తొచ్చి చప్పున నవ్వొచ్చింది.

ఇపుడు అదేం అడగబోతుందో తెల్సినా, తెలియనట్లు "సరే ఇపుడేం చేయాలి?" అన్నాను.

"నాకు కథ చెప్పాలి"

"ఈ రోజు కాదమ్మా. రేపెప్పుడైనా చెప్తాలే"

"కథ వినకపోతే నాకు నిద్ర రాదు నాన్నగారూ. మీరు బిజీగా ఉంటారనే చందమామ తెచ్చుకున్నాను చదువుకుందామని. కాని అదేమో ఇపుడు కన్పించటం లేదు. ప్లీజ్ నాన్నగారూ! ఓ కథ చెప్పరూ" అంది గోముగా.

"లాభం లేదమ్మా. నిద్ర ముంచుకు వచ్చేస్తోంది" ఆవులిస్తూ అన్నాను.

"ప్లీజ్ నాన్నగారూ!" అంది తన చిన్ని చేతుల్తో గడ్డం పట్టుకుని బ్రతిమాలుతూ.

అలా బ్రతిమాలించుకోవటం నాకెంతిష్టమో.

"సరే పద" అన్నప్పుడు దాని మొహం వింత వెలుగుతో నిండిపోయింది.

పప్పీ చిన్నప్పటి నుండి కథలంటే చెవికోసుకుంటుంది. ఈ అలవాటు చేసింది నేనే. దానికి నాలుగో యేట నించే రోజూ పడుకోబోయేముందు బోల్డు కథలు చెప్పేవాడిని. ఒక్కోరోజు వరుసగా మూడో నాలుగో కథలు చెప్తేనే కాని ఒప్పుకునేది కాదు.

పప్పీకి కథలు చెప్పటం కోసం చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాలన్నీ

వదలకుండా చదివేవాడిని. ట్వింకిల్ లాంటి కామిక్ పుస్తకాలు కంఠతా చేసేవాడిని. ఏవీ లేనపుడు నేనే ఓ కథ అల్లి చెప్పేవాడిని. పప్పీకి మాత్రం నేను వూహించి చెప్పిన కథలే బాగా నచ్చేవి. ఎందుకంటే వాటిలో మాయలూ, మంత్రాలూ, రాజకుమారి, ఓ దుర్మార్గుడైన రాక్షసుడూ ఇవన్నీ ఉండేట్లు జాగ్రత్త పడేవాడిని. పప్పీకి అలాంటి కథలంటే బోల్డంత ఇష్టం.

ఇప్పుడు పప్పీకి తెలుగు, ఇంగ్లీష్ చదవటం బాగా వచ్చాక తనే పుస్తకాలు తెచ్చుకుని చదువుకుంటోంది.

"ఏం కథ చెప్తారూ" అంది నా పక్కన పడుకుంటూ.

"నీ కెలాంటి కథ కావాలంటే అలాంటిది"

"మరేమో ఆ కథలో బాగా జోక్స్ ఉండాలి" అంది. ఈ మధ్య హాస్యం ఉండే కథలంటే ఇష్టపడుతోంది. టామ్ అండ్ జెర్రీ - డేల్అండ్ నట్స్‌లోలా వేరొకర్ని ఏడ్పించే కథలంటే మరీ ఇష్టం.

బాగా వూహించి రసవత్తరంగా చెప్పాను.

"చాలా బావుంది నాన్నగారూ" అంది. "మీ కింత మంచికథలు ఎలా తెలుసు?" తన గదిలోకి వెళ్ళిపోయే ముందు అడిగింది.

తృప్తిగా నవ్వి వూరుకున్నాను.

☆☆☆

"మీరు దాని ట్వింకిల్ పుస్తకమట చూశారా" భోం చేసి ఏదో మాగజైన్ తిరగేస్తున్నప్పుడు నా శ్రీమతి అడిగింది.

"దాని గదిలో పూర్తిగా వెదికిందా? ఎప్పుడూ పుస్తకాలు పారేసుకుంటుంది. దీనికి మరీ అజాగ్రత్త ఎక్కువైంది" అన్నాను కొద్దిగా చిరాగ్గా.

"దాని కథల పుస్తకాలు కన్పించటంలేదని అసలే అది బెంబేలెత్తి పోతుంటే కోప్పడాతారేమండీ" అంది శ్రీమతి.

"ఎవరైనా ఫ్రెండ్స్ కిచ్చిందేమో"

"లేదు నాన్నగారూ. ఎవ్వరికీ ఇవ్వలేదు. అసలీ రోజు ఫ్రెండ్స్ ఎవ్వరూ ఇంటికి రాలేదు" అంది పప్పీ.

"అయినా అంతంత డబ్బులు పెట్టి కొన్న పుస్తకాలు ఎలా పోతున్నాయి?" అన్నాను కొద్దిగా తీవ్రంగా.

అది బిక్క మొహం వేసింది. దానికి కన్నీళ్ళు పొంగుకొస్తున్నాయి.

చప్పున జాలేసింది నాకు. దాన్ని దగ్గరకు తీసుకున్నాను.

"పోన్లెమ్మా. ఈ రోజు కథ మమ్మీ చెప్తుందిలే" అన్నాను.

"మమ్మీ వద్దు నాన్నగారూ. చప్పచప్పటి కథలు చెప్తుంది"

"తన వంటలా" అని జోడించాను. ఇద్దరం నవ్వుకున్నాం.

"నాకు కథలు రావు బాబూ. మీ తండ్రీ కూతుళ్ళు ఏం చెప్పుకుంటారో మీ ఇష్టం" శ్రీమతి రుసరుసలాడింది.

"ఈ రోజు కథలో ఏమేం ఉంటాయి" పప్పీ అడిగింది.

"మాంత్రికులూ, రాక్షసులూ . . . ." మధ్యలోనే ఆపేసింది పప్పీ.

"ఎప్పుడూ అవేనా నాన్నగారూ! ఈ రోజు కథలో పులులూ, సింహాలు. . . అలాంటి జంతువులుండేటట్లు చెప్పండి" అంది.

కథ చెప్పాక పప్పీ తన గదికెళ్ళి పడుకుంది.

అప్పటివరకూ నిశ్శబ్దంగా ఉన్న శ్రీమతి "మిమ్మల్ని ఓ విషయం అడుగుతాను. ఏమీ అనుకోరుగా" అంది.

ఎప్పుడూ లేనిది సీరియస్‌గా అడుగుతుంటే ఆశ్చర్యపోయాను.

"పసిపిల్లను ఏడ్పిస్తే మీకేమొస్తుంది? ఎందుకలా చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు" అంది మరలా తనే.

"ఏమిటి నువ్వంటున్నది" అన్నాను.

"నాకు ఈ మధ్యనే తెల్సింది. మొదట్లో మీ ఆఫీస్ పని ఇంటికి ఎక్కువగా తెచ్చుకో నపుడు దాని కథల పుస్తకాలు అదృశ్యం కావటం, మీకు పని ఎక్కువగా ఉన్నప్పుడు దాని పుస్తకాలు దొరకటం చూసి కొద్దిగా అనుమానం వచ్చిన మాట మాత్రం వాస్తవం. అయినా తండ్రి అయి ఉండి మీరలా చేస్తారంటే నమ్మకం కుదర లేదు. తీరా ఓ వారం క్రితం మీ అల్మైరాలో మీరు ఆఫీస్ ఫైళ్ళ కోసం అని ప్రత్యేకంగా ఉంచుకున్న అర తెరిచి చూస్తే మీ దొంగతనం బయటపడింది"

"ఆ అరని మీరెవ్వరూ తెరవకూడదని చెప్పానుగా" అన్నాను లేని కోపాన్ని తెచ్చుకుంటూ.

"అందుకే అనుమానం వచ్చి ఓ రోజు తెరిచి చూశా. ఇవిగోండి పుస్తకాలు" అని శ్రీమతి నా ఎదురుగా ఓ బండెడు పుస్తకాలు పడేసింది. చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు, ట్వింకిల్ ఇత్యాది పుస్తకాలు.

"ఎవరైనా విన్నా నవ్వుతారండీ. కూతురి పుస్తకాలు దొంగిలిస్తున్నారంటే" అంది నోరు నొక్కుకుంటూ.

నేను తనని దగ్గరగా కూచోబెట్టుకున్నాను.

"నిజమే. నేనే ఆ పుస్తకాలు దాచి పెట్టాను. ఏం చేయమంటావు? దాని చిన్నప్పటి నుండీ దానికి కథలు చెప్పటం అంటే నాకు ఇష్టం. దానిచేత బ్రతిమాలించుకుని చెప్పాక అది చాలా మంచికథ అంటే నాకు తృప్తి. అదో వ్యసనంగా మారింది. ఈ మధ్య కాలంలో దానికి చదవటం బాగా వచ్చాక అదే పుస్తకాలు కొనుక్కుని

చదువుకోవటం ప్రారంభించింది. అది నాన్నగారూ! కథ చెప్పరూ! అని అడగటం మానేశాక ఓ రకమైన వెలితి ఏర్పడింది. అందుకే దాని కథల పుస్తకాలు దాచేసి. . ." నేను చెప్పటం ఆపాను.

శ్రీమతి నన్ను దగ్గరకు తీసుకుంది. అందులో లాలింపు. పసిపిల్లాడిని గుండెలకు హత్తుకున్నట్లు - "మిమ్మల్ని నేను గాక మరెవరు అర్థం చేసుకుంటారూ!" లాంటి భావం మిళితమై!

● *మయూరి వీక్లీ, జనవరి 5, 1996* ●